

**వరలక్ష్మీ.. వరప్రదాయిని** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం నగరంలోని వివిధ ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని చోట్ల సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 17 ఆగస్టు 2024 | HYDERABAD




శుక్రవారం ఆకస్మిక తనిఖీల్లో భాగంగా అధికారులకు సూచనలిస్తున్న పురపాలక ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్






*రాష్ట్రంలోనే కీలకమైన ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఇన్‌చార్జీల పాలనలో జవాబుదారీతనం కరువై.. పరిపాలన గాడి తప్పుతున్నది. ఉస్మానియా, నిలోఫర్, కోఠి ఈఎన్‌టీ, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖాన, ఎర్రగడ్డ ఛాతి దవాఖానల్లో పూర్తి స్థాయి సూపరింటెండెంట్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది.. రోగులు వాపోతున్నారు.*


*- సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ)*



# ప్రధాన ఆసుపత్రుల్లో ఇన్‌చార్జీల పాలన

## పూర్తిస్థాయి సూపరింటెండెంట్లు లేక ఇక్కట్లు

## పేదలకందని వైద్యసేవలు



**ఉస్మానియా వైద్య కళాశాల** పరిధిలోనే అత్యంత కీలకమైన ఉస్మానియా, నిలోఫర్, కోఠి ఈఎన్‌టీ, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖాన, ఎర్రగడ్డ ఛాతి దవాఖానలకు నిత్యం వందలు, వేల సంఖ్యలో రోగులు ఓపీ, ఐపీ సేవలు పొందుతుంటారు. అయితే ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా దీర్ఘకాలంగా అక్కడ పనిచేస్తున్న వైద్యాధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిలోఫర్, ఉస్మానియా, ఈఎన్‌టీ, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖానల్లో ప్రొఫెసర్లతో పాటు సూపరింటెండెంట్లు కూడా బదిలీ అయ్యారు. దీంతో ఆ దవాఖానల్లో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఎవరినీ నియమించకపోవడంతో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతున్నది.

### పూర్తిస్థాయి బాధ్యతలు ఇవ్వకపోవడంతో..

ఇన్‌చార్జి సూపరింటెండెంట్ల పరిపాలనతో పలు దవాఖానల్లో జవాబుదారీతనం ఉండటం లేదని, పరిపాలన గాడితప్పుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయి బాధ్యతలు ఇవ్వకపోవడంతో తాము ఇన్‌చార్జీలమే కదా, తమకెందుకులే అనే ధోరణితో కొందరు వ్యవహరిస్తున్నారని, దీంతో సరైన జవాబుదారీతనం లేక దవాఖానల్లో పరిపాలన గాడితప్పుతున్నదని స్వయంగా ఆ వైద్యశాలల వర్గాలే చెబుతున్నాయి. నిత్యం 2వేల నుంచి 3వేల మంది ఓపీ, ఐపీ రోగులతో రద్దీగా ఉండే ఉస్మానియా, నిలోఫర్, ఈఎన్‌టీ, టీబీ, శ్వాస సంబంధ వ్యాధులకు ప్రత్యేకమైన ఎర్రగడ్డ ఛాతి దవాఖాన, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖానలకు రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయి సూపరింటెండెంట్లను నియమించకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇన్‌చార్జీల పాలనతో ఇబ్బందులు తప్పడం లేదని దవాఖాన సిబ్బంది, రోగులు వాపోతున్నారు.

### ప్రొఫెసర్ల కొరత..

అసలే ప్రొఫెసర్ల కొరత, ఉన్న ఒక్కరిద్దరిలో ఒకరికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించడంతో ఆయా దవాఖానల్లో వైద్యసేవలు ప్రశ్నార్థకంగా మారుతున్నట్లు రోగులు చెబుతున్నారు. కొన్ని దవాఖానల్లో ఉన్న వారిలో ఒకరికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించగా, మరి కొన్ని వాటిల్లో బయటి నుంచి బదిలీపై వచ్చిన వారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో వారు పరిపాలన పరంగా బిజీగా మారి వైద్యసేవలు అందించలేకపోతున్నారు. అంతేకాకుండా ఇన్‌చార్జి బాధ్యతల కారణంగా సదరు అధికారులు పరిపాలనపై పూర్తిస్థాయి దృష్టి పెట్టేందుకు వెనకంజ వేస్తున్నారు. ఫలితంగా పేదలకు సక్రమంగా వైద్యసేవలు అందడం లేదు.

### సూపరింటెండెంట్ లేని ఫీవర్ హాస్పిటల్

వర్షాకాలంలో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. నగరంలో దవాఖానలన్నీ జలుబు, దగ్గు, జ్వరం, డెంగీ తదితర సీజనల్ వ్యాధిగ్రస్తులతో కిక్కిరిసిపోతున్నాయి. ఇలాంటి సమయంలో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులకు ప్రత్యేక దవాఖానగా పేరున్న నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో ప్రొఫెసర్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొన్నటి వరకు సూపరింటెండెంట్‌గా ఉన్న డా.శంకర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో కోరంటి సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఆర్ఎంవో పరిపాలనలోనే దవాఖాన కొనసాగుతున్నది.


## కుక్కకాటుకు సత్వర వైద్యం

### జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

### సీహెచ్‌సీ సందర్శనలో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్



మేడ్చల్, ఆగస్టు 16 : కుక్కకాటుకు సత్వరమే వైద్యం అందించాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మేడ్చల్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అన్ని విభాగాలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. కుక్కలు, కోతుల బారి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కుక్కకాటుకు గురైన వారు ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీహెచ్‌సీ సందర్శనలో భాగంగా పరీక్షా కేంద్రం, ఆయుష్ విభాగం, ఫార్మసీ, ల్యాబ్, ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు.

# రెండు షిఫ్టుల్లో చెత్త సేకరణ

### అధికారులకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశం

### పారిశుధ్య పనుల ఆకస్మిక తనిఖీ

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణను గాడిలో పెట్టేందుకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ప్రత్యేక దృష్టి సారించారు. 'పారిశుధ్య నిర్వహణలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై 'ఏడి చెత్త ఆడనే' శీర్షికన శుక్రవారం 'నమస్తే' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. స్పందించిన పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా జర్నలిస్టు కాలనీలోని పాలపిట్ట సర్కిల్ పరిసర ప్రాంతాల్లో రహదారులపై ఉన్న ప్యాచ్ వర్క్స్ చేయకుండా వదిలేసిన గుంతలను పరిశీలించారు. స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ పనులు చేపట్టినా ఎప్పటికప్పుడు రోడ్డు పునరుద్ధరణ పూర్తి చేయాలన్నారు. అదే ప్రాంతంలో వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి సంపు నిర్మించేందుకు అనువైన ప్రాంతాన్ని చూడాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

### కార్మికులతో ఇంటరాక్షన్

వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న గార్బేజీ వనరబుల్ పాయింట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం. 45, రోడ్ నం. 70 గౌతంనగర్ బస్తీ, దీన్ దయాళ్‌నగర్ బస్తీ, ఫిలింనగర్, పీఈటీ పార్కు ప్రాంతాల్లో తరచూ చెత్త వేసే ప్రాంతాలను దానకిశోర్ పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న ఎస్ఎఫ్ఏ, పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనితీరు వివరాలు ఆరా తీశారు. కార్మికుల హాజరు తదితర వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య లుంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని కార్మికులకు దానకిశోర్ చెప్పారు. పనివేళల్లో తప్పనిసరిగా యూనిఫాం, హ్యాండ్ గ్లౌజ్‌లు ధరించి రక్షణ చర్యలు పాటించాలన్నారు. నగరంలో చెత్త ఎక్కువగా ఉత్పన్నమయ్యే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అలాంటి ప్రాంతాల్లో రెండు షిఫ్టుల్లో చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న నీటి నిల్వ సంపుల పనులను పరిశీలించారు.



శుక్రవారం ఉస్మానియా మెడికల్ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

# నేడు రాష్ట్రవ్యాప్తంగా ఓపీ సేవలు బంద్

### పశ్చిమ బెంగాల్ ఘటనకు వైద్యుల నిరసన

### శుక్రవారం సైతం విధులు బహిష్కరించి.. ర్యాలీలు

సిటీబ్యూరో/ఖైరతాబాద్, సుల్తాన్‌బజార్: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. శనివారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో ఓపీ సేవలను బహిష్కరిస్తున్నట్లు ఆలిండియా మెడికల్ అసోసియేషన్ న్యూస్ లెటర్ ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు సాయిరాం వెల్లడించారు. అత్యవసర సేవలు యథావిధిగా కొనసాగుతాయని, ఓపీ సేవలు మాత్రం ఒక్కరోజు నిలిపివేస్తున్నామన్నారు. కాగా, బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ.. శుక్రవారం గాంధీ దవాఖానలో జూడాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం, గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ భూపేందర్ సింగ్ రాథోడ్, కార్యదర్శి డాక్టర్ అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. నిమ్స్‌లోనూ రెసిడెంట్ వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు 48 గంటల నిరసన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఓపీ సేవలతో పాటు శస్త్రచికిత్సలను నిలిపివేశారు. సుమారు 400 మందికిపైగా వైద్య సిబ్బంది తమ విధులను బహిష్కరించారు. 34 విభాగాలకు చెందిన వైద్య, ఇతర సిబ్బంది నిరసనలో పాల్గొన్నారు. అలాగే ఉస్మానియా మెడికల్ కళాశాల నుంచి దవాఖాన వరకు జూడాలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. భారీ ర్యాలీ నిర్వహించారు.

## విద్యుత్ డిమాండ్.. 72. 8 మిలియన్ యూనిట్లు

### వర్షాకాలంలోనూ రెట్టింపైన కరెంటు వినియోగం

### ఉక్కపోతతో పెరిగిన ఫ్యాన్లు, ఏసీల వాడకం



సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): వేసవిలో ఎండల తీవ్రతతో ఉక్కపోతతో ఇబ్బందులు పడటం సాధారణమే అయినా.. అలాంటి పరిస్థితి ఇప్పుడు వర్షాకాలంలోనూ కనిపిస్తున్నది. ఒకవైపు వర్షాలు కురుస్తున్నా.. మరోవైపు ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. నిరంతరం ఫ్యాన్లు, ఏసీలు లేనిదే ఉండలేకపోతున్నామని నగరవాసులు వాపోతున్నారు. ఆగస్టు నెలలోనే వరసగా వర్షాలు కురుస్తున్నా.. మధ్యలో ఉక్కపోత ఎక్కువ ఉండటంతో విద్యుత్ వినియోగం సైతం ఒక్కసారిగా పెరిగింది. ఆగస్టు 4న గ్రేటర్‌లో 60.3 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండగా, ఆగస్టు 14న 72.8 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. ఈ పది రోజుల వ్యవధిలోనే సుమారు 12 మిలియన్ యూనిట్ల దాకా పెరిగింది. పైగా ఇదే నెలలో అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రత 33 డిగ్రీలుగా నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణంగా వర్షాకాలంలో 30 డిగ్రీల లోపే ఉంటుంది. ఉష్ణోగ్రత పెరగడానికి ప్రధాన కారణం ఉపరితల ఆవర్తనమని అధికారులు పేర్కొంటున్నారు.

### బిల్లు చెల్లింపునకు

## థర్డ్ పార్టీ యాప్స్

సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): విద్యుత్ వినియోగదారులు బిల్లుల చెల్లింపును సులభతరం చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ (టీజీఎస్‌పీడీసీఎల్) సంస్థ చర్యలు చేపట్టింది. డిజిటల్ చెల్లింపులు పెరగడంతో చాలా మంది అందుబాటులో ఉన్న మొబైల్ యాప్‌ల ద్వారానే తమ బిల్లులు చెల్లిస్తున్నారు. గత జూలై నుంచి పలు కారణాలతో థర్డ్ పార్టీ యాప్‌ల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా కడుతున్నారు. అయితే లక్షలాది మంది వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి యాప్‌ల ద్వారా చెల్లించేందుకు అలవాటుపడిన క్రమంలో సంస్థ యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డిస్కం పరిధిలో మొత్తం కోటికి పైగా విద్యుత్ వినియోగదారులు ఉండగా, అందులో 60 శాతం మంది ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్‌కు ప్రజలు ఎక్కువగా థర్డ్ యాప్‌లను వినియోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. ఆదిశగా చర్యలు చేపట్టారు.ఆగస్టు నెలాఖరు నాటికి ఎంపిక చేసిన మొబైల్ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.



### ఎక్కువగా ఫిర్యాదులు

## సీవరేజీ సమస్యలవే

### జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఉప్పల్, ఆగస్టు 16 : సాంకేతిక పరిజ్ఞానంతో సీవరేజీ సమస్యలను పరిష్కరిస్తామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామాంతాపూర్‌లోని రాంరెడ్డినగర్ నుంచి ఉప్పల్ నల్లచెరువు వరకు ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ట్రంక్‌లైన్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. చాలా కాలం కిందట నిర్మించిన లైన్లలో ఇబ్బందులను తొలగించేలా చూడాలని ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి ఎండీ దృష్టికి తీసుకొచ్చారు. కాల్ సెంటర్‌కు ప్రతి రోజూ 2వేల 500 ఫిర్యాదులు వస్తున్నాయని, అందులో 1400 కాల్స్ సీవరేజీకి సంబంధించినవే ఉంటున్నాయని జలమండలి ఎండీ చెప్పారు. ప్రాధాన్యతల వారీగా సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు.

## ఎట్టకేలకు బల్దియాలో కదలిక

### 'డబుల్' ఇండ్ల మౌలిక వసతుల కల్పనకు టెండర్లు

సిటీబ్యూరో, ఆగస్టు 16(నమస్తే తెలంగాణ) : డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతుల కల్పనపై జీహెచ్ఎంసీ అధికారుల్లో ఎట్టకేలకు కదలిక వచ్చింది. నిధుల లేమితో ఇంతకాలంగా సౌకర్యాలు కల్పించడంపై దృష్టి పెట్టలేదు. దాదాపు రూ. 200 కోట్ల మేర నిధులను జలమండలికి కేటాయించాల్సి ఉన్నప్పటికీ మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలోనే లబ్ధిదారులంతా కొన్ని నెలలుగా భారీ ఎత్తున ఇందిరాపార్కు, జలమండలి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఇటీవల జరిగిన ప్రజావాణిలో మేయర్, కమిషనర్‌ను ఘేరావ్ చేసి.. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు హామీ ఇచ్చిన కమిషనర్.. ప్రాధాన్యతా క్రమంలో డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతుల కల్పనకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వాటర్ సప్లయి, డ్రైనేజీ , లిఫ్టులు, కరెంట్, రహదారులు, ఇతర సదుపాయాల పనులకు టెండర్లను ఆహ్వానించారు. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు నియోజకవర్గంలోని డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించనున్నారు.

## దిద్దుబాటు చర్యలు షురూ

### సుంకిశాల ప్రాజెక్టుకు నలుగురు ఇంజినీర్లు



సిటీబ్యూరో, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : సుంకిశాల ఘటన నేపథ్యంలో జలమండలి దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. సుంకిశాల ప్రాజెక్టులో రిటైయినింగ్ వాల్ నిలువునా కుప్పకూలిన ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత ప్రాజెక్టు విభాగం అధికారులపై రెండు రోజుల కిందట చర్యలు తీసుకున్నారు. ప్రాజెక్టు డివిజన్ సర్కిల్-3 (సుంకిశాల)లో పనిచేస్తున్న సీజీఎం ఎస్. కిరణ్‌కుమార్, జీఎం బి.మరియరాజ్, డీజీఎం ఎస్.ప్రశాంత్, మేనేజర్ కేవీపీ హరీశ్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ప్రాజెక్టు డివిజన్-3లో కొత్త ఇంజినీర్లకు బాధ్యతలు అప్పగిస్తూ.. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఓ అండ్ ఎం సర్కిల్-2లో పనిచేస్తున్న టీవీ శ్రీధర్‌ను ప్రాజెక్టు డివిజన్ సర్కిల్-2కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎం. రఘుకు బాధ్యతలు అప్పగించారు. ప్రాజెక్టు డివిజన్-3 జీఎంగా బి. మహేశ్‌కుమార్, డీజీఎంగా అభిలాశ్, మేనేజర్‌గా స్వామిని నియమించారు. అలాగే జలమండలి పీ అండ్ ఏ డైరెక్టర్‌గా సుదర్శన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఎండీ ఆశోక్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈఎన్సీ, రెవెన్యూ వీఎల్ ప్రవీణ్ అదనంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పీ అండ్ ఏ డైరెక్టర్ బాధ్యతలను సుదర్శన్‌కు అప్పగించారు. కాగా, సుంకిశాల ఘటనలో పర్యవేక్షణ లోపాన్ని కారణంగా చూపుతూ ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌ను నాన్-ఫోకల్ పోస్టుకు బదిలీ చేస్తూ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.